క్లుప్తంగా

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



శ్రీలలితాపీఠంలో సత్యనారాయణ స్వామి వ్రతంలో దంపతులు

సీతంపేట : కార్తీకమాసం శుద్ధ ఏకాదశి సందర్భంగా అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించా రు. పీఠం అర్చకులు వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తకంగా వ్రతం జరిపించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

యోగ సిద్ధాంజనేయుడికి ప్రత్యేక పూజలు



శ్రీరామపాద దురంధరుడిగా దర్శనమిచ్చిన యోగ సిద్ధాంజనేయుడు

మురళీనగర్ : జాతీయ రహదారి సూర్యానగర్-2లో వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాసం రెండో మంగళ వారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఆర విల్లి శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో పాంచరాత్ర ఆగమ సాంప్రదాయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 7 గంటలకు స్వామికి సింధూరార్చన చేశారు. స్థానిక భక్తు లు సామూహిక సుందరాకాండ పారాయణ చేశారు. ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు, యశోద దంపతులు యోగ సిద్ధాంజనేయుడికి పూజలు చేశారు. సాయంత్రం భజనానంద హారతి సమర్పించారు. యోగ సిద్ధాంజనేయుడిని శ్రీరామ పాద సేవా దురంధరుడిగా ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ సభ్యుడు, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

తాజా కూరగాయలు విక్రయించండి



రైతుబజార్‌లో ఉల్లిపాయలు పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్

సీతంపేట : రైతుబజార్‌లో తాజా కూరగాయలు, ఆకుకూరలు విక్రయించాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్ సూచించారు. నరసింహనగర్ రైతుబజార్‌లో మంగళవారం ఆయన పర్యటించారు. ఉల్లి, టమాట స్టాల్స్, నాణ్యత పరిశీలించారు. నాణ్యత కలిగిన ఉల్లి, టమాట, కూరగాయలు విక్రయించాలని రైతులు, డ్వాక్రా వ్యాపారులను ఆదేశించారు. నాణ్యత విషయంలో వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. అనంతరం సబ్సిడీపై వంట నూనె విక్రయాలు పరిశీలించారు. రైతుల గుర్తింపు కార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, సహాయకుడు ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

కుటుంబం చెంతకు యువతి



కుటుంబ సభ్యులకు సోనంను అప్పగిస్తున్న శ్రద్ధా ఫౌండేషన్ సభ్యులు

సీతమ్మధార: మధ్యప్రదేశ్ నుంచి విశాఖ వచ్చేసిన ఒక యువతిని ఏయూటీడీ సంస్థ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. మధ్యప్రదేశ్ నుంచి విశాఖ వచ్చేసిన సోనం (22)ను ఆరు నెలల క్రితం విశాఖ రైల్వే స్టేషన్లో గుర్తించి ఏయూటీడీ సిబ్బంది ద్వారకానగర్‌లో గల టి.ఎస్.ఆర్. కాంప్లెక్సులో ఉన్న జీవీఎంసీ - ఏయూటీడీ మహిళా షెల్టర్‌కు తరలించారు. మానసిక వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకుని శ్రద్ధా ఫౌండేషన్ నుంచి వచ్చిన సైకియాట్రిస్ట్ డాక్టర్ స్వరాలి చికిత్స చేశారు. కోలుకున్న సోనంను మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ దగ్గర లస్కర్ గ్రామానికి శ్రద్ధా టీం ద్వారా వైజాగ్ నుంచి నేరుగా తీసుకెళ్లి ఆమె నానమ్మ సుమిత్ర బాయ్, తాత లక్ష్మారాంలకు అప్పగించారు. సోనం కుటుంబ సభ్యులు ఏయూటీడీ, శ్రద్ధా సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

హడలెత్తిస్తున్న కుక్కలు

- సీతమ్మధారలో గుంపులుగా సంచారం
- వెంబడించడంతో స్థానికుల బెంబేలు



సీతమ్మధారలో ఓ ఇంటి ముందు గుంపుగా సంచరిస్తున్న కుక్కలు

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ - 3 పరిధిలోని పలు ప్రాంతాల్లో రాత్రి పూట కుక్కల అరుపులతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నా వాటిని నియంత్రించే నాథుడే కరువయ్యాడు. సీతమ్మధార పరిసర ప్రాంతాల్లో రాత్రిపూట విధులు ముగించుకుని ద్విచక్ర వాహనాలపై ఇంటికొచ్చే వాహనదారులను కుక్కలు వెంబడిస్తున్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. నార్త్ ఎక్స్‌టెన్షన్, టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ, నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, రాధాకృష్ణ లే అవుట్, బాలయ్య శాస్త్రి లే అవుట్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. రాత్రి పూట పలు ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో కుక్కలు ఎప్పుడు అకస్మాత్తుగా వచ్చి దాడి చేస్తాయోనని వాహన చోదకులు హడలిపోతున్నారు. సీతమ్మధార రైతుబజార్‌లో కూడా ఒక కుక్క తిష్ట వేసి తరచూ వినియోగదారులపై దాడి చేస్తోంది. రాత్రిపూట గస్తీ నిర్వహించే పోలీసులు కూడా కుక్కల కారణంగా ఇబ్బంది పడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కార్తీకమాసం కావడంతో అధిక సంఖ్యలో అయ్యప్ప మాలధారులు ఏదో ఒక చోట అంబలం పూజకి వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు కుక్కల బారిన పడుతున్నారు. కుక్కలు వెంట తరమడంతో ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంటోందని, ఆ సమయంలో వేగంగా వాహనాలు నడపడంతో ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా ఈ ప్రాంతాల్లో కుక్కల బండి జాడ మచ్చుకైనా కానరావడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గం పరిధిలో పలువురు కుక్క కాటుకి గురై రేబిస్ వ్యాక్సిన్లు వేయించుకుంటున్నారు. ముఖ్యంగా రాత్రిపూట కుక్కలు కరిస్తే ప్రైవేట్ వైద్యులే శరణ్యం. దీంతో అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. ఎస్ఎఫ్ఎస్ స్కూలు నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు కుక్కలు అధిక సంఖ్యలో గుంపులుగా చేరి స్వైర విహారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు రాత్రిపూట వీధుల్లోకి రావాలంటే భయపడిపోతున్నారు. జీవీఎంసీ వెటర్నరీ విభాగం అధికారులు స్పందించి జోన్ - 3 పరిధిలో గల కుక్కలను తరలించే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చురుగ్గా హౌసింగ్ డీడీల వాపస్



దరఖాస్తుదారు వివరాలు నమోదు చేస్తున్న యూసీడీ ఉద్యోగి

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ - 3 పరిధిలో గల హౌసింగ్ దరఖాస్తుదారులకు డీడీల వాపస్ ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ ఆదేశాల మేరకు జోన్ - 3 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ పర్యవేక్షణలో యూసీడీ విభాగం అధికారులు చెక్కుల వాపస్ ప్రక్రియ వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఇళ్ల మంజూరు కాని దరఖాస్తుదారులకు డిపాజిట్ల వాపస్ కోసం ప్రభుత్వం రూ.76.27 లక్షల మేరకు నిధులు విడుదల చేసింది. దీంతో రోజుకి 30 మంది దరఖాస్తుదారుల వివరాలు బయోమెట్రిక్ విధానంలో నమోదు చేస్తున్నారు. హౌసింగ్ డీడీ, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ వివరాలు యూసీడీ విభాగం సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జోన్ - 3 పరిధి తూర్పు నియోజకవర్గంలో 223 మంది, ఉత్తర నియోజకవర్గంలో 30 మంది దరఖాస్తుదారులున్నారు. ఇప్పటి వరకు మొత్తం 167 మంది దరఖాస్తుదారులకు రూ.63.25 లక్షల మేర డిపాజిట్లు వాపస్ చేశారు. ఇంకా 86 మంది దరఖాస్తుదారులకు రూ.12.50 లక్షల మేర డిపాజిట్లు వాపస్ చేయాల్సి ఉంది. యూసీడీ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎల్.రాము ఆధ్వర్యంలో సిబ్బంది రోజుకి 30 మంది దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి ఆశీలమెట్టలోని జోన్ - 3 కార్యాలయానికి రప్పించి వివరాలు నమోదు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 18లోగా మిగిలిన దరఖాస్తుదారులకు చెక్కులు అందజేస్తామని ఏపీడీ రాము తెలిపారు.

జీతాలు చెల్లించాలని ఆందోళన



ధర్నా చేస్తున్న కేజీహెచ్ సెక్యూరిటీ గార్డులు

సీతంపేట : కేజీహెచ్ సెక్యూరిటీ గార్డులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం అక్కయ్యపాలెం లేబర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఉద్యోగులపై కాంట్రాక్టర్లు, అధికారుల వేధింపులు ఆపాలని, కనీస వేతనాలు చెల్లించాలని నినాదాలు చేశారు. అనంతరం సమస్యలపై జాయింట్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి. కుమార్, ఎం.సుబ్బారావు, చంద్రమౌళి, చంద్రశేఖర్, సంతోష్, వై.రాజు, కేజీహెచ్ సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వాహనచోదకులను తనిఖీ చేస్తున్న ద్వారకా ట్రాఫిక్ పోలీసులు

సీతమ్మధార : ద్వారకా జోన్ ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం స్టేషన్ పరిధిలో గల రామా టాకీస్, ఆశీలమెట్ట, గురుద్వారా తదితర ప్రాంతాల్లో కేసులు నమోదు చేశారు. హెల్మెట్ లేకపోవడం, త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్‌లో డ్రైవింగ్, ఇతర ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనచోదకులపై ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో కేసులు నమోదు చేశారు. అలాగే ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లడం, సైలెన్సర్ తొలగింపు వంటి నిబంధనలు ఉల్లంఘించిన వారి మీద కూడా కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా 40 మంది వాహనచోదకుల డ్రైవింగ్ లైసెన్సులను మూడు నెలలపాటు తాత్కాలికంగా సస్పెండ్ చేశామని ఎస్ఐ భాస్కరరావు తెలిపారు. వాహన చోదకులంతా విధిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు. రాంగ్‌రూట్ ప్రయాణాలు, త్రిబుల్ రైడింగ్ చేయరాదని సూచించారు. మైనారిటీ తీరని పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, అలా ఇస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అన్నసమారాధన అభినందనీయం



స్వాములకు వడ్డన చేస్తున్న కేకే రాజు

సీతంపేట : ఎరుమేలి అయ్యప్ప అన్నసమారాధన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో పోర్టు ఆస్పత్రి కూడలి వద్ద అయ్యప్ప స్వాములకు నిర్వహిస్తున్న అన్నసమారాధనలో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొన్నారు. మాలధారణ స్వాములకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా మండల కాలంపాటు వేలాది మంది మాలధారణ భక్తులకు అన్నప్రసాదం సమకూర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, 50వ వార్డు కార్పొరేటర్ వి.ప్రసాద్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సీతమ్మధార: నార్కోటిక్ స్నిఫర్ డాగ్ సహాయంతో విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్రవేశ ద్వారం-1 వద్ద సుమారు 30 కిలోల గంజాయిని నగర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో నగరంలో గంజాయి, ఇతర నార్కోటిక్ డ్రగ్స్ కట్టడిలో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, బీచ్ రోడ్ తదితర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిటీ టాస్క్ ఫోర్స్, 4వ పట్టణ పోలీసులు, డాగ్ స్క్వాడ్ కలిసి మంగళవారం రైల్వే స్టేషన్ వద్ద చేపట్టిన తనిఖీల్లో గంజాయిని గుర్తించారు. తదుపరి చర్యలకై జీఆర్పీ పోలీసులకు అప్పగించారు.

30 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో రైల్వే స్టేషన్‌లో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్రంలోని గజపతి జిల్లాకు చెందిన రాజన్, బిహార్ రాష్ట్రంలోని ఈస్ట్ చంపారన్ జిల్లాకు చెందిన జావేద్ అన్సారీ వద్ద 30 కేజీల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడుకు అప్పగించారు. అనంతరం రిమాండు నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

ఎగ్జాస్ట్ సైలెన్సర్లు అమర్చితే కఠిన చర్యలు



మెకానిక్‌లతో ట్రాఫిక్ సీఐలు శ్రీనివాస్, కోటేశ్వరరావు, వెంకటరావు, షణ్ముఖరావు

మద్దిలపాలెం : ద్విచక్ర వాహనాలకు మార్పు చేసిన ఎగ్జాస్ట్ సైలెన్సర్లు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. సిటీ ట్రాఫిక్ జోన్ - 2 పరిధిలో ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు అమర్చే ఆటోమొబైల్ మెకానిక్‌లకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గల మాధవధార వుడా కాలనీ జీవీఎంసీ కమ్యూనిటీ హాలులో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ - 2 ట్రాఫిక్ సీఐలు దాశరథి శ్రీనివాస్, కోటేశ్వరరావు, షణ్ముఖరావు, వెంకటరావు మాట్లాడారు. ఆటో మొబైల్ షాప్ ఓనర్లు 80 నుంచి 100 డెసిబుల్స్ శబ్దం దాటిన మాడిఫైడ్ సైలెన్సర్లను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒరిజినల్ సైలెన్సర్లకు బదులుగా శబ్ద కాలుష్యం పెంచే మాడిఫైడ్ సైలెన్సర్‌లను వినియోగిస్తే సౌండ్ పొల్యూషన్ పెరిగి తోటి వాహనచోదకులు, పాదచారులు, పిల్లలు, గర్భిణులు ఇబ్బంది పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని విక్రయిస్తే సంబంధిత వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా వాహనచోదకులు వీటిని తీసుకొస్తే మెకానిక్‌లు అమర్చొద్దని స్పష్టం చేశారు. నగరంలో ప్రశాంత వాతావరణం కల్పించడానికి పోలీసు శాఖతో సహకరించాలని కోరారు. ఎవరైనా వాహన చోదకులు మాడిఫైడ్ సైలెన్సర్లు తీసుకొస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. కార్యక్రమంలో జోన్ - 2 పరిధిలోని కంచరపాలెం, గోపాలపట్నం, ఎయిర్ పోర్టు, గోపాలపట్నం, పెందుర్తి, గాజువాక, స్టీల్‌ప్లాంట్, దువ్వాడ, హార్బర్, న్యూపోర్టు, మల్కాపురం, వన్‌టౌన్, పోలీస్‌స్టేషన్ల పరిధిలో గల మెకానిక్‌లు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వరప్రసాద్

మురళీనగర్ : మురళీనగర్ నివాసి, టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు సనపల వరప్రసాద్‌ను కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వరప్రసాద్ గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలుపునకు చేసిన కృషితోపాటు, తెలుగుదేశం ఆవిర్భావం నుంచి క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఈ మేరకు ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఈ పదవికి ఎంపిక చేశారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరానికి స్పందన



దొండపర్తి ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో గల పట్టణ ఆరోగ్య కేంద్రంలో హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి (అగనంపూడి) ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు బెస్ట్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ గుర్తింపు పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.శ్రావణి షరోని ఆధ్వర్యంలో రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి క్యాన్సర్ పరీక్షలు చేశారు. శిబిరంలో ప్రివెంటివ్ ఆంకాలజిస్టు డాక్టర్ సంగీత పరీక్షలు నిర్వహించారు. మొత్తం 50 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు పది మందికి పాజిటివ్ రావడంతో క్యాన్సర్ ఆస్పత్రికి సిఫారసు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ కె.ప్రసాద్, ఇన్వెస్టిగేటర్ రాజేష్, సిస్టర్ మంగ, సచివాలయం హెల్త్ సెక్రటరీ, ఆశా వర్కర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ధరల పెరుగుదలతో సామాన్యులపై భారం

- 14న సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



పాదయాత్రలో మాట్లాడుతున్న సీఐటీయూ నేత మణి

సీతమ్మధార : నిత్యం పెరిగిపోతున్న నిత్యావసర సరకుల ధరలు నియంత్రించాలని, పెంచిన కరెంట్ చార్జీలు రద్దు చేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని, యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు తెలిపారు. సీతమ్మధార పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఇంటింటికీ నిర్వహించిన పాదయాత్రలో ఆయన మాట్లాడారు. నిత్యావసర సరకుల ధరలు భారీగా పెరిగి ప్రజల నెత్తిన గుదిబండలా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోమన్న చంద్రబాబు అందుకు విరుద్ధంగా 4 నెలల్లోనే రూ.8 వేల కోట్లు భారం వేయడం, వచ్చే ఏడాదికి మరో రూ.11 వేల కోట్ల భారం మోపడానికి సిద్ధమవడం దారుణమన్నారు. సీఐటీయూ నేత పి.మణి మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామని చెప్పిన వారు ప్రస్తుతం కార్మికులనే తొలగించడానికి సన్నాహాలు చేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు.

ప్రజలపై భారం మోపితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. మోదీ, టీడీపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 14న నిర్వహించే ధర్నా విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సంబంధిత కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవుని సన్నిధిలో ఏకాదశి పూజలు



వైభవుని సన్నిధిలో ఏకాదశి పూజల్లో పాల్గొన్న భక్తులు

మురళీనగర్ : మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో కార్తీక శుద్ధ ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. మురళీనగర్ రామాలయంలో సీతారామలక్ష్మణులకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సీతారాములకు క్షీరాభిషేకం అనంతరం సహస్ర తులసీదళార్చన చేశారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు ఆకాశ దీపారాధన చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక ఏకాదశి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో వైభవుడికి తులసీ దళార్చన నిర్వహించారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆకాశ దీపారాధన చేశారు.